సాక్షి మెదక్

మంగళవారం । 18 । జూలై । 2023



పంపిణీకి నోచుకోని డబుల్ ఇళ్లు

దేవుడు వరమిచ్చినా పూజారి కరుణించని చందంగా మారింది హుస్నాబాద్‌లో డబుల్ బెడ్రూం ఇళ్ల పరిస్థితి. సొంతింటి కల నెరవేరక లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు. 8లో



విద్యుదాఘాతంతో ఫర్నీచర్ దగ్ధం

పెద్దశంకరంపేటలో ఓ వ్యక్తి ఇంట్లో జరిగిన విద్యుదాఘాతంతో ఫర్నీచర్‌తో పాటు బట్టలు, ఇతర సామగ్రి కాలిపోయాయి. 8లో



ముక్కిన బియ్యం.. పురుగుల అన్నం

అల్లాదుర్గంలోని ప్రభుత్వ పాఠశాలలకు ముక్కిన, పురుగు పట్టిన బియ్యం సరఫరా అవుతున్నా.. సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదు. 9లో

న్యూస్‌రీల్

హుండీ లెక్కింపు



కానుకలను లెక్కిస్తున్న నిర్వాహకులు

రామాయంపేట(మెదక్): మహంకాళీ ఆలయంలో హుండీని సోమవారం ఈఓ మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో లెక్కించారు. మహంకాళి జాతర ఉత్సవాల సందర్భంగా భక్తులు వేసిన కానుకలను లెక్కించగా మొత్తం రూ.78,170 ఆదాయం వచ్చినట్లు తెలిపారు.

రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేయాలి



మాట్లాడుతున్న జేఏసీ నాయకులు

అల్లాదుర్గం(మెదక్): అల్లాదుర్గం మండలాన్ని రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేయాలని అల్లాదుర్గం నియోజకవర్గ సాధన సమితి అధ్యక్షుడు కంచరి బ్రహ్మం, జేఏసీ నాయకులు కాలరాములు, బలరాం కోరారు. సోమవారం విలేకరులతో మాట్లాడుతూ.. అల్లాదుర్గంలో సబ్ డివిజన్ కార్యాలయాలు కొనసాగుతున్నాయని, రెవెన్యూ డివిజన్ చేస్తే పరిసర ప్రాంతాలైన రేగోడు, పెద్దశంకరంపేట్, టేక్మాల్ మండలాల ప్రజలకు ప్రయోజనం ఉంటుందన్నారు. ప్రజాప్రతినిధులు, ప్రజలు ఏకమై రెవెన్యూ డివిజన్ సాధనకు పోరాడాలన్నారు. కార్యక్రమంలో నాయకులు రవి, సాయిలు, బేతయ్య, బాలయ్య, రషీద్, సాయిలు పాల్గొన్నారు.

గడప గడపకూ కాంగ్రెస్



కరపత్రాలు పంపిణీ చేస్తున్న తిరుపతిరెడ్డి

నిజాంపేట(మెదక్): గడప గడపకూ కాంగ్రెస్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని ఖాసీంపూర్ గ్రామంలో సోమవారం కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు కంఠారెడ్డి తిరుపతి రెడ్డి పర్యటించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే అందించే పథకాలపై ప్రజలకు వివరించారు. ఖాసీంపూర్ తండా నుంచి తిప్పనగుల్ల రోడ్డు లేదని తండావాసులు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తాము అధికారంలోకి వస్తే రూ.2 లక్షల రుణమాఫీ, రూ.4 వేల పింఛన్, ఇంటి నిర్మాణానికి రూ. 5లక్షల సాయం అందించనున్నట్లు తెలిపారు. అనంతరం ఖాసీంపూర్‌కు చెందిన 50 మంది యువకులు కాంగ్రెస్‌లో చేరగా, వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి పంజా మహేందర్, జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు పల్లె రామచంద్ర గౌడ్, నిజాంపేట మండల అధ్యక్షుడు లింగంగౌడ్, పట్టణ అధ్యక్షుడు నసీరుద్దీన్, సేవాదళ్ అధ్యక్షుడు మధుసూదన్ రెడ్డి, సిద్ధ రాములు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

మెదక్ మున్సిపాలిటీ: మెదక్ నియోజకవర్గంలో పలుచోట్ల మంగళవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ట్రాన్స్ కో ఏడీఈ మోహన్ బాబు తెలిపారు. జిల్లా కేంద్రంలోని 132 కేవీ సబ్‌స్టేషన్ మరమ్మతు కారణంగా పట్టణంతో పాటు మెదక్, హవేలీఘనపూర్, చిన్న శంకరంపేట మండలాల్లో ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

పోలీస్ స్టేషన్ తనిఖీ



అధికారులకు సూచనలిస్తున్న డీఎస్పీ యాదగిరిరెడ్డి

నర్సాపూర్: నర్సాపూర్ పోలీస్ స్టేషన్‌ను తూప్రాన్ డీఎస్పీ యాదగిరిరెడ్డి సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్‌లో రికార్డులను పరిశీలించి, కేసుల పురోగతిపై అడిగి తెలుసుకున్నారు. అనంతరం సిబ్బందికి పలు సూచనలు చేశారు. స్టేషన్, సర్కిల్ పరిధిలో చేపడుతున్న కార్యక్రమాలను సీఐ షేక్‌లాల్ మథార్, ఎస్‌ఐ శివకుమార్ ఆయనకు వివరించారు.

సవాలక్ష ఆంక్షలు

- జేపీఎస్‌లపై క్రమబద్ధీకరణపై ప్రభుత్వం కొర్రీలు
- అభివృద్ధి పనులకు మార్కుల కేటాయింపు
- పని తీరును కొలిచేందుకు కమిటీ
- సర్కారు నిబంధనలపై జూనియర్ కార్యదర్శుల ఆగ్రహం



క్రమబద్ధీకరణ చేయాలని ధర్నా చేస్తున్న జేపీఎస్‌లు (ఫైల్)

మెదక్‌జోన్: ప్రభుత్వ నోటిఫికేషన్ ద్వారా పరీక్ష రాసి ఎంపికైన జూనియర్ పంచాయతీ కార్యదర్శులకు క్రమబద్ధీకరణ కోసం పోరాటం తప్పడంలేదు. తొలుత మూడేళ్ల సర్వీస్ పూర్తయిన తర్వాత రెగ్యులరైజ్ చేస్తామని చెప్పిన ప్రభుత్వం.. మరో ఏడాది గడువు పొడిగించింది. నాలుగేళ్ల సర్వీస్ పూర్తయిన తర్వాత కూడా క్రమబద్ధీకరించకపోవడంతో ఆగ్రహించిన జూనియర్ పంచాయతీ కార్యదర్శులు గతేడాది మేలో విధులు బహిష్కరించి 16 రోజుల పాటు సమ్మెబాట పట్టారు. మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు హామీతో తిరిగి విధుల్లో చేరారు. తాజాగా 8 రకాల మార్గదర్శకాలను విడుదల చేసి, వాటి పనితీరు ఆధారంగా మార్కులు ఇచ్చి, పర్మనెంట్ చేస్తామని చెప్పడంతో జేపీఎస్‌లు ఆందోళనకు గురవుతున్నారు.

- జిల్లాలో 469 గ్రామ పంచాయతీలు ఉండగా ఇందులో 100 మంది రెగ్యులర్, 47 ఔట్ సోర్సింగ్ కార్యదర్శులు, 322 మంది జేపీఎస్‌లు విధులు నిర్వర్తిస్తున్నారు.
- 2019లో ప్రభుత్వ నోటిఫికేషన్ ద్వారా పరీక్ష రాసి ఎంపికైన జూనియర్ పంచాయతీ కార్యదర్శులు విధుల్లో చేరారు.
- అందులో కొందరికి ఇతర ఉద్యోగాలు రావటంతో ఖాళీలు ఏర్పడ్డాయి. వాటిని ఔట్ సోర్సింగ్ ద్వారా భర్తీ చేశారు.
- మొదత జేపీఎస్‌లు మూడేళ్ల ఏళ్ల సర్వీస్ పూర్తి అయ్యాక రెగ్యులరైజ్ చేస్తామని ప్రభుత్వం పేర్కొంది.
- మూడేళ్ల తర్వాత నిబంధన పేరిట మరో ఏడాది పొడిగించారు. గతేడాది ఏప్రిల్‌కు నాలుగేళ్ల సర్వీస్ పూర్తి చేసుకున్నారు.
- అయినా ప్రభుత్వం క్రమబద్ధీకరణ చేయకపోవడంతో 2022 మేలో సమ్మె చేపట్టారు.
- ఈ క్రమంలో మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు క్రమబద్ధీకరణపై హామీ ఇవ్వటంతో సమ్మె విరమించి విధుల్లో చేరారు.

నిబంధనల కొర్రీలు

- నాలుగేళ్ల సర్వీసు దాటిన జేపీఎస్‌లను క్రమబద్ధీకరించేందుకు ప్రభుత్వం 8 రకాల మార్గదర్శకాలను విడుదల చేసింది.
- వాటికి అనుగుణంగా పనులు చేస్తేనే మార్కుల ఆధారంగా పరిగణలోకి తీసుకుంటామని తెలిపింది.
- నాలుగేళ్లు పూర్తిచేసుకున్న జేపీఎస్‌ల పనితీరును కొలిచేందుకు ముగ్గురితో ఓ కమిటీని వేయనున్నట్లు పేర్కొంది.
- అదనపు కలెక్టర్, ఎస్పీ, లేదా డీఎస్పీ, డీఎఫ్ఓలతో కూడిన కమిటీ ఆధీనంలో జేపీఎస్‌ల పని తీరును గుర్తిస్తామని తెలిపింది.
- కాగా ప్రభుత్వ నిబంధనలపై జేపీఎస్‌లు పెదవి విరుస్తున్నారు. విద్యుత్ బిల్లు చెల్లింపు, ట్రాక్టర్ కిస్తీలు సర్పంచ్ పరిధిలో ఉంటుందని, గ్రీన్ బడ్జెట్ నిధులు విడుదల కాకుంటే తాము నష్టపోవాల్సి వస్తుందని చెబుతున్నారు.
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పంచాయతీలకు అందించే ఆర్థిక సంఘం నిధులను కొద్ది నెలలుగా నిలిపివేయడంతో జీపీల నిర్వహణ కష్టంగా మారింది.
- ఇలాంటి సమయంలో ప్రభుత్వం మార్కుల పేరిట నిబంధనలు విధించి తమను ఇబ్బందులకు గురిచేయడం సరికాదని జేపీఎస్‌లు ఆవేదన చెందుతున్నారు.

మార్కులు ఇలా..

రోడ్లు, డ్రైనేజీలు శుభ్రం, దోమల నివారణ చర్యలు, పంచాయతీ రికార్డులు, డంపింగ్ యార్డు, వర్మీ కంపోస్టు తయారీ, వైకుంఠ ధామం నిర్వహణ, పన్ను వసూలు, మొక్కల పెంపకం, క్రీడా ప్రాంగణ నిర్వహణ పక్కాగా చేపడితే 35 మార్కులు కేటాయిస్తుంది. ఇందులో వందశాతం ఇంటి పన్నుకు 10 మార్కులు, నర్సరీ, మొక్కల పెంపకం, పంపిణీకి 10 మార్కులు, రోడ్ల పక్కన, ఇళ్లలో, పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాల్లో మొక్కలు నాటడం, తోటల పెంపకానికి 10 మార్కులు, విద్యుత్ బిల్లులు, ట్రాక్టర్ ఈఎంఐ చెల్లింపునకు 10 మార్కులు, పంచాయతీ నిధుల నుంచి 10శాతం గ్రీన్ బడ్జెట్‌కు కేటాయిస్తే 5 మార్కులు, తడి, పొడి చెత్త సేకరణకు 15 మార్కులు, జనన, మరణాల రికార్డుల నిర్వహణకు 5 మార్కులు కలిపి మొత్తం 100 మార్కులను కేటాయించింది.

షరతులు తొలగించాలి



నాలుగేళ్ల సర్వీస్ పూర్తయిన తమను ఎలాంటి షరతులు లేకుండా క్రమబద్ధీకరించాలి. ప్రభుత్వం ఇచ్చిన మార్గదర్శకాల ప్రకారం పనులు చేయాలంటే మాకు నష్టం తప్పదు. సర్పంచుల బాధ్యలను మాకు ముడిపెట్టడం సరైంది కాదు. నిబంధనలపై ప్రభుత్వం పునరాలోచించాలి.

– కుమార్, జేపీఎస్‌ల జిల్లా అధ్యక్షుడు



ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ సునీతారెడ్డిలను సన్మానిస్తున్న నాయకులు

భక్తిభావం కలిగి ఉండాలి

ఎమ్మెల్యే మదన్‌రెడ్డి

శివ్వంపేట(నర్సాపూర్): ప్రతీ ఒక్కరు భక్తి భావంతో మెదలాలని ఎమ్మెల్యే మదన్‌రెడ్డి అన్నారు. మండలంలోని గోమారంలో నిర్వహించిన జాతర వేడుకల్లో రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ సునీతాలక్ష్మారెడ్డి నివాసం నుంచి ఫలహార బండి ఊరేగింపు నిర్వహించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, పోతరాజు విన్యాసాలతో ఫలహార బండి ఊరేగింపు చేపట్టారు. పూజా మహోత్సవంలో ఎమ్మెల్యే మదన్‌రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వర్షాలు సంమృద్ధిగా కురిసి రైతులు పాడి పంటలతో సంతోషంగా ఉండాలని వేడుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా సునీతాలక్ష్మారెడ్డి, ఎమ్మెల్యే మదన్‌రెడ్డిని నాయకులను సన్మానించారు. కార్యక్రమంలో చైర్‌పర్సన్ కుటుంబ సభ్యులు హన్మంత్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, శశిధర్ రెడ్డి, సంతోష్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, బిక్షపతిరెడ్డి, మహిపాల్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి, నర్సింహారెడ్డి తదితరులు ఉన్నారు.

బోనాల సంబురాలు..

తూప్రాన్: మహంకాళి జాతర మహోత్సవ వేడుకల్లో భాగంగా రెండో రోజు సోమవారం అమ్మవారికి గావు, రంగాలు, ఫలహార బండ్లు, తొట్టెల కార్యక్రమాలు నిర్వహించారు. మున్సిపల్ చైర్మన్ రవీందర్‌గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో భక్తులు పెద్దసంఖ్యలో హాజరై అమ్మవారి ఆశీస్సులు పొందారు. ఉత్సవాల్లో జోగిని నిషాక్రాంతి నెత్తిన బోనమెత్తి ఆటపాటలతో సందడి చేశారు. ఎరుపుల సుజాత భవిష్యవాణిని వినిపించగా, ఎరుపుల లక్ష్మణ్ గావు పట్టారు. యువత అమ్మవారికి ఫలహారం బండ్లు, డీజే సౌండ్ మధ్య తొట్టెలను ఊరేగింపుగా తీసుకెళ్లారు.



నెత్తిన బోనంతో జోగిని నిషాక్రాంతి నృత్యం

బీఆర్‌ఎస్‌కు రైతులు మద్దతు ఇవ్వాలి

నర్సాపూర్ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మదన్‌రెడ్డి

వెల్దుర్తి(తూప్రాన్): ప్రజలు, రైతులు బీఆర్‌ఎస్‌కు మద్దతు ఇవ్వాలని నర్సాపూర్ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని మాసాయిపేటలో సోమవారం నిర్వహించిన రైతు సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. కరెంట్ ఇవ్వలేని కాంగ్రెస్ కావాలా.. మూడు పంటలకు విద్యుత్ ఇచ్చే బీఆర్‌ఎస్ కావాలా.. అని ప్రశ్నించారు. రైతులకు కరెంటు దండగ అన్న కాంగ్రెస్ పార్టీని రైతులు నమ్మే పరిస్థితి లేదని, కాంగ్రెస్ నాయకులు సీఎం కేసీఆర్‌ను తిట్టడం తప్ప అభివృద్ధి గురించి పట్టించుకోవడంలేదన్నారు. అనంతరం బీఆర్‌ఎస్‌కు మద్దతుగా ఉంటామని రైతులతో తీర్మానం చేయించారు. కార్యక్రమంలో ఎంపీపీ స్వరూప, జెడ్పీటీసీ రమేశ్‌గౌడ్, సర్పంచ్ మధుసూదన్‌రెడ్డి, ప్రజాప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.



నాయకులతో చర్చిస్తున్న కేంద్రమంత్రి పురుషోత్తం రూపాల, పక్కన ఎమ్మెల్యే రఘునందనరావు

తెలంగాణలో అధికారంలోకి రావాలి

కేంద్ర మంత్రి పురుషోత్తం రూపాల

చేగుంట(తూప్రాన్): తెలంగాణలో బీజేపీ అధికారంలోకి వచ్చేలా కార్యకర్తలు, నాయకులు కృషి చేయాలని కేంద్రమంత్రి పురుషోత్తం రూపాల అన్నారు. మండలంలోని వడియారంలో సోమవారం ఏర్పాటు చేసిన మెదక్, జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గాల ముఖ్య కార్యకర్తల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. బూత్ స్థాయిలో పార్టీని బలోపేతం చేయాలని, పార్లమెంట్ నియోజకవర్గ నాయకులతో మాట్లాడి పరిస్థితులను తెలుసుకున్నారు. రూట్‌మ్యాప్ తయారు చేసి ప్రణాళిక ప్రకారం కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. అనంతరం పొలంపల్లిలో మాజీ ఎమ్మెల్యే ఆర్ఎస్ వాసురెడ్డిని పరామర్శించారు. కార్యక్రమంలో దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్ రావు, జిల్లాల అధ్యక్షులు గడ్డం శ్రీనివాస్, శ్రీకాంత్ రెడ్డి, పార్లమెంట్ ప్రభారి జయశ్రీ, రామ్‌మాధవ్, జాతీయ కార్యవర్గ సభ్యుడు చింత సంతోష్, మండల అధ్యక్షుడు భూపాల్, గోవింద్, గణేష్, సంతోష్‌రెడ్డి, నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

సోమేశ్వరాలయంలో పూజలు

చిన్నశంకరంపేట(మెదక్): మండల కేంద్రంలోని చరిత్రాత్మక సోమేశ్వరాలయాన్ని కేంద్రమంత్రి పురుషోత్తం రూపాల సందర్శించారు. ఈసందర్భంగా ఆయనకు ఆలయ పూజారులు సంగమేశ్వరపంతులు, శివప్రసాద్ పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. సోమనాథ్ ఆలయం పోలికలతో ఉన్న మరో ఆలయం చూడడం ఆనందంగా ఉందన్నారు. ఆయనతో సర్పంచ్ రాజిరెడ్డి, ఉప సర్పంచ్ జీవన్, వార్డు సభ్యులు నాగరాజ్‌రెడ్డి, బాబు, రమేష్‌గౌడ్, బీజేపీ నాయకులు ఉన్నారు. అనంతరం దళిత కార్యకర్త బీజేపీ బూత్ ఇన్‌చార్జ్ మల్గ భూపాల్ ఇంట్లో అల్పాహారం చేశారు.

క్షమాపణ చెప్పకుంటే అడ్డుకుంటాం

పీసీసీ డెలిగేట్ ఆంజనేయులుగౌడ్



మాట్లాడుతున్న ఆంజనేయులుగౌడ్

నర్సాపూర్: టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డితో పాటు కాంగ్రెస్ కార్యకర్తలకు నర్సాపూర్ ఎమ్మెల్యే చిలుముల మదన్‌రెడ్డి బహిరంగ క్షమాపణ చెప్పాలని పీసీసీ డెలిగేట్ ఆంజనేయులుగౌడ్ డిమాండ్ చేశారు. సోమవారం విలేకరులతో మాట్లాడారు. పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డిని, కార్యకర్తలను దొంగలని ఎమ్మెల్యే మదన్‌రెడ్డి విమర్శించడాన్ని తీవ్రంగా ఖండించారు. వెంటనే బహిరంగ క్షమాపణ చెప్పాలని, లేదంటే పర్యటన అడ్డుకుంటామని హెచ్చరించారు. రేవంత్‌రెడ్డిపై ఆరోపణలు చేస్తే ఎమ్మెల్యే టికెట్ వస్తుందనే ఆశతో ఆరోపణలు చేశారని విమర్శించారు. కాగజ్‌మద్దూర్‌లో ఎనిమిదేళ్ల క్రితం గంగిరెద్దుల వారికి డబుల్ బెడ్ రూం ఇండ్లు ఇస్తామని హామీ ఇచ్చి వారి నివాసాలను కూల్చారని, ఇంత వరకు ఒక్క ఇల్లు కూడా ఇవ్వలేదని ఆరోపించారు. ఉచిత కరెంటు పథకం దివంగత సీఎం రాజశేఖర్‌రెడ్డి తెచ్చారని, దానిని సక్రమంగా అమలు చేయడంలో బీఆర్‌ఎస్ విఫలమైందని అన్నారు. సమావేశంలో కాంగ్రెస్ బ్లాక్ అధ్యక్షుడు రిజ్వాన్, నాయకులు శ్రీనివాస్‌గుప్తా, సురేష్, రషీద్, అశోక్, శ్రీశైలం, అశోక్‌గౌడ్, రాధాకిషన్‌గౌడ్, శ్రీపతి, అజ్మద్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఉపాధ్యాయులకు అవగాహన

మెదక్ కలెక్టరేట్: నేడు ఇన్‌స్పైర్ ఇన్‌చార్జ్ ఉపాధ్యాయులకు అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు డీఈఓ రాధాకిషన్, జిల్లా సైన్స్ అధికారి రాజిరెడ్డి తెలిపారు. కలెక్టరేట్ ఆడిటోరియంలో ఉదయం10 గంటలకు మెదక్ డివిజన్ పరిధిలో పాఠశాలల ఉపాధ్యాయులకు, మధ్యాహ్నం 2గంటలకు తూప్రాన్, నర్సాపూర్ డివిజన్ పాఠశాలల ఉపాధ్యాయులకు అవగాహన కల్పిస్తామన్నారు. ప్రతీ పాఠశాల నుంచి ఒక ఇన్‌స్పైర్ ఇన్‌చార్జ్ ఉపాధ్యాయుడిని పంపించాలని హెచ్‌ఎంలకు సూచించారు.

సాగు లెక్క పక్కా

ఉమ్మడి జిల్లా సాగు వివరాలు

జిల్లా	క్లస్టర్లు	విస్తీర్ణం
మెదక్	76	2.85 లక్షలు
సిద్దిపేట	127	5.82 లక్షలు
సంగారెడ్డి	116	7.19 లక్షలు



పంటల వివరాల నమోదుకు కొత్త యాప్

- ఇకనుంచి అధికారులు పంట పొలాల దగ్గరికి వెళ్లాల్సిందే
- ప్రయోగాత్మకంగా ఐదు మండలాల్లో ఫొటోలతో అప్‌లోడ్
- త్వరలో నూతన విధానానికి శ్రీకారం

సాక్షి, సిద్దిపేట: రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా వ్యవసాయ శాఖ పలు సంస్కరణలకు శ్రీకారం చుడుతోంది. ఇందులో భాగంగా పంటల సాగు వివరాలను సర్వేనంబర్ల ఆధారంగా నమోదు చేసే విధానాన్ని చేపట్టింది. కొన్నేళ్లుగా ప్రతి సంవత్సరం సాగు వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తోంది. పలు సందర్భాల్లో ఇబ్బందులు తలెత్తాయి. దీంతో వ్యవసాయ శాఖ ఈసారి కొత్త విధానానికి శ్రీకారం చుట్టింది. పంట పొలాల దగ్గరకు వెళ్లి వివరాలు నమోదుతోపాటు పంటల ఫొటోను యాప్‌లో అప్‌లోడ్ చేయాలని నిర్ణయించింది. ప్రయోగాత్మకంగా ఉమ్మడి మెదక్ జిల్లాలో పలు మండలాలను ఎంపిక చేసి ఈ విధానాన్ని ప్రారంభించనుంది.

ఉమ్మడి మెదక్‌లో 15.86లక్షల ఎకరాల సాగు విస్తీర్ణం

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 15.86లక్షల సాగు విస్తీర్ణం ఉండగా, 319 క్లస్టర్లు ఉన్నాయి. ప్రతి యేడాది క్లస్టర్ల వారీగా రైతులు ఏయే పంటలు, ఎన్ని ఎకరాల్లో సాగు చేస్తున్నారన్న వివరాలు వ్యవసాయ శాఖ సీజన్ల వారీగా నమోదు చేస్తోంది. ఆన్‌లైన్‌లో నమోదు చేసిన వివరాల్లో పలు లోటుపాట్లు ఉండటంతో రైతులకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. ఈ క్రాప్ బుకింగ్‌ను మరింత పక్కాగా అమలు చేసేందుకు సరికొత్త సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకోవాలని వ్యవసాయ శాఖ నిర్ణయించింది.

- నాలుగేళ్లుగా రైతుల వారీగా పంటల వివరాల నమోదు వ్యవసాయ విస్తరణ అధికారులు(ఏఈఓ)చేస్తున్నారు. చాలామంది పంట పొలాలకు వెళ్లకుండా రైతులను అడిగి రాసుకోవడంతో పంట ఉత్పత్తులను విక్రయించే సమయంలో ఇబ్బందులు తలెత్తుతున్నాయి.
- దీంతో ఈ సీజన్‌లో ఏఈఓలు రైతుల వారీగా పంట పొలాన్ని సందర్శించి పూర్తి సమాచారం సేకరించేలా నూతన విధానాన్ని తీసుకొచ్చారు.
- ఏఈఓ యాప్‌లో పంట పొలానికి దగ్గర 50 మీటర్ల దూరం వరకు పోతేనే సమీపంలో ఉన్న సర్వే నెంబర్లు, పెడస్టల్ మ్యాప్‌లో చూపిస్తుంది. రైతుల వారీగా పొలాన్ని పరిశీలించి ఏ పంట సాగు చేశారు.. ఏ రకం విత్తనం వేశారు.. సాగు నీటి సౌకర్యం ఉందా అనే వివరాలను అందులో నమోదు చేయాలి.

ఎంపికైన మండలాలు ఇవే..

పంట పొలాల వివరాలను ఫొటోలతో సహా అప్‌లోడ్ చేసేందుకు ప్రయోగాత్మకంగా ఉమ్మడి మెదక్ జిల్లాలో ఐదు మండలాలను ఎంపిక చేశారు. రైతు సాగు చేసిన ప్రతి పంట ఎంత విస్తీర్ణంలో సాగు చేశారు. దాని ఫొటోను అప్‌లోడ్ చేయాలి. సిద్దిపేట జిల్లాలో నారాయణరావుపేట, సంగారెడ్డిలో రాయికోడ్, మెదక్ జిల్లాలో రామాయంపేట, చెగుంట, కొడిపల్లి మండలాలను ఎంపిక చేశారు.

- త్వరలో ఈ ప్రక్రియను ప్రారంభించనున్నారు. ఇందుకోసం ఇప్పటికే ప్రయోగాత్మకంగా పరిశీలించారు. త్వరలో ఏఈఓలకు శిక్షణ ఇవ్వనున్నారు. ఈ విధానంతో ఇకపై పంటల సాగు లెక్క పక్కాగా తేలనుంది.

త్వరలో శిక్షణ

పంటల వివరాల నమోదు మరింత పక్కాగా చేసేందుకు కొత్త యాప్‌ను అందుబాటులోకి తీసువచ్చారు. అందులో 50మీటర్ల దూరంలోనే ఆ పంటకు సంబంధించిన వివరాలు నమోదు చేయాల్సి ఉంటుంది. అలాగే సిద్దిపేట జిల్లాలోని నారాయణరావు పేటలో ప్రయోగాత్మకంగా పంటల వివరాలు ఫొటోలతో సహా యాప్‌లో అప్‌లోడ్ చేయబడుతుంది. దీనిపై త్వరలో హైదరాబాద్‌లో శిక్షణ ఇవ్వనున్నారు.

– శివప్రసాద్, డీఏఓ, సిద్దిపేట



నారాయణరావుపేట మండలం లక్ష్మీదేవిపల్లిలో నమోదు ప్రక్రియను పరిశీలిస్తున్న అధికారులు

క్లుప్తంగా

గుప్త నిధుల కోసం తవ్వకాలు


తవ్వకాలు జరిపిన ప్రాంతం

మద్దూరు(హుస్నాబాద్): గుప్త నిధుల కోసం గుర్తు తెలియని వ్యక్తులు తవ్వకాలు జరిపారు. వివరాలు ఇలా ఉన్నాయి..మద్దూరు మండల పరిధిలోని ధర్మారం గ్రామంలో మల్లిబాయి వ్యవసాయ భూమిలోని బండరాయి చుట్టూ గత వారం రోజుల క్రితం గుర్తు తెలియని వ్యక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం శనివారం రాత్రి అక్కడ రెండు చోట్ల గుప్త నిధుల కోసం గుర్తు తెలియని వ్యక్తులు తవ్వినట్లు రైతులు పేర్కొన్నారు.

దాడికి పాల్పడిన వారిపై కేసు నమోదు

శివ్వంపేట(నర్సాపూర్): దాడికి పాల్పడిన వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రవికాంత్‌రావ్ సోమవారం తెలిపారు. మండల పరిధి గంగాయిపల్లిలో నివాసగృహాల వద్ద షేర్‌సంధి విషయంలో ఆదివారం రాత్రి గొడవ చోటుచేసుకుంది. తలారి యాదగిరి, తలారి మల్లేశ్, తలారి అరుణ్, తలారి బాబు, తలారి కుక్కల భాస్కర్‌లపై కట్టెలు, ఇటుకలతో దాడి చేసి గాయపరిచారు. తలారి భాస్కర్, తలారి రాజు, తలారి స్వదేష్, తలారి సంఘమేశ్‌పై కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

విద్యుదాఘాతంతో ఫర్నిచర్ దగ్ధం


కాలిపోయిన వస్తువులు చూపిస్తున్న దృశ్యం

పెద్దశంకరంపేట(మెదక్): పెద్దశంకరంపేటలో విద్యుదాఘాతంతో ఆస్తినష్టం సంభవించింది. సోమవారం పేటకు చెందిన చాకలి కృష్ణ ఇంట్లో విద్యుదాఘాతంతో ఫర్నిచర్‌తో పాటు బట్టలు, ఇతర సామగ్రికి కాలిపోయాయి. దీంతో అతనికి సుమారు రూ.లక్ష వరకు ఆస్తినష్టం సంభవించినట్లు, ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడు కోరారు.

ట్రాక్టర్లనుంచి బ్యాటరీల చోరీ

శివ్వంపేట(నర్సాపూర్): గుర్తుతెలియని వ్యక్తులు కెజివిల్ ట్రాక్టర్ల నుంచి బ్యాటరీలను చోరీ చేసిన సంఘటన ఎదుల్లాపూర్ గ్రామంలో శనివారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన రైతులు నర్సింలు, బలకుంద ఆంజనేయులు, చుక్క శ్రీనువాస్‌లకు చెందిన కెజివిల్ ట్రాక్టర్ల నుంచి బ్యాటరీలను చోరీ చేశారు. పొలం దుక్కి దున్నిన అనంతరం వ్యవసాయ పొలాల్లోనే ఉంచిన ట్రాక్టర్ల నుంచి దొంగలించినట్లు బాధిత రైతులు తెలిపారు.

పంపిణీకి నోచని డబుల్ బెడ్రూం ఇళ్లు..!


హుస్నాబాద్ పట్టణంలో నిర్మించిన డబుల్ బెడ్రూం ఇళ్లు

- హుస్నాబాద్‌లో కొనసాగుతున్న పనులు
- వేలల్లో లబ్ధిదారులు
- ఐదుగురికి ఇచ్చి చేతులు దులుపుకున్న అధికారులు
- అనర్హుల పేరిట పంపిణీ ఆలస్యం
- ఇబ్బందుల్లో అర్హులు


ఇళ్లను ప్రారంభిస్తున్న మంత్రి కేటీఆర్ (ఫైల్)

హుస్నాబాద్: దేవుడు వరమిచ్చిన పూజారి వరమివ్వని చందంగా మారింది డబుల్ బెడ్రూం ఇళ్ల లబ్ధిదారుల పరిస్థితి. తెలంగాణ ప్రభుత్వం అధికారంలోకొచ్చిన తర్వాత ఏ ఒక్కరికి కూడా ఇళ్లు కట్టివ్వలేదు. హుస్నాబాద్ పట్టణంలో మొదటి విడతగా 160 ఇళ్లు, రెండో విడతకు 400 డబుల్ బెడ్రూం పంపిణీకి మంజూరు చేసింది. పట్టణ శివారులో జీప్లస్ టూ పద్ధతిన ఇళ్లు నిర్మించారు. ఎన్నో ఏళ్ల సొంతింటి కల నేరవేరిందని సంతోషం పడుతున్న లబ్ధిదారులకు కలగానే మిగిలింది. ప్రభుత్వం ఏర్పాటైన తరువాత ఇళ్ల మంజూరునకు లబ్ధిదారుల నుంచి దరఖాస్తులు ఆహ్వానించగా, 1426 వచ్చాయి. ప్రస్తుతం 264 ఇళ్లు పూర్తికాగా మిగిలినవి చివరి దశలో ఉన్నాయి. లబ్దిదారుల ఇళ్ల మంజూరునకు జిల్లా అధికారులు సర్వే నిర్వహించారు. తొలి విడతలో 480 మందిని అర్హులుగా ఎంపిక చేశారు. ఈ క్రమంలో జాబితాలో అనర్హులు ఉన్నారంటూ లబ్ధిదారులు పెద్ద ఎత్తున ఆందోళనకు దిగారు. దీంతో అధికారులు రీ సర్వే చేపట్టారు. ఈ రీసర్వేలో 189 మందిని అనర్హులుగా గుర్తించి తొలగించారు. మొత్తం 560 ఇళ్లకుగాను 264 ఇళ్లు మాత్రమే పూర్తి చేశారు. ఈ 264 ఇళ్లకోసం మొత్తం 342 మందిని ఎంపిక చేశారు. దీంతో మార్చి 22న డ్రా తీయగా, 264 మందికి ఇళ్ల పంపిణీ చేశారు. 78 మందికి నిరాశే మిగిలింది.

మంత్రి కేటీఆర్ చేతుల మీదుగా పట్టాల పంపిణీ
డబుల్ బెడ్రూం ఇళ్లను మే 5వ తేదీన రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ చేతుల మీదుగా ప్రారంభించి కేవలం 5 గురు లబ్దిదారులకు మాత్రమే పట్టాలు ఇచ్చారు. అప్పటి నుంచి పట్టాలు ఇచ్చిన వారికి ఇళ్లు ఇవ్వలేదు. ఎంపిక చేసిన మిగితా లబ్ధిదారులకు ఇండ్ల పట్టాలు ఇవ్వకపోవడంతో వారు నిరాశతో ఉన్నారు. పట్టాలు తీసుకున్న వారికి ఇల్లు వచ్చిందనే సంతోషం లేదు. డబుల్ బెడ్రూం ఇళ్లకు ఎంపికైన వారికి కూడా సంతోషం లేకుండా పోయింది. ప్రతి రోజూ ఇళ్ల వద్దకు వెళ్లి చూసి సంతోషపడాల్సిందే తప్ప గృహ ప్రవేశం చేసింది లేదు.

20 నుంచి 30 ఇళ్లు మిగిలాయి



డబుల్ బెడ్రూం ఇండ్లు నిర్మాణ పనులు తుది దశకు వచ్చాయి. దాదాపు 20 నుంచి 30 ఇండ్లకు సంబంధించి చిన్న చిన్న పనులు మిగిలి ఉన్నాయి. ఇప్పటికే పనులు పూర్తి చేయాలని ఎమ్మెల్యే సతీష్ కుమార్ అధికారులను ఆదేశించారు. ఎమ్మెల్యే ద్వారా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి త్వరలోనే లబ్ధిదారులకు పట్టాలు ఇప్పించి గృహ ప్రవేశాలు చేయిస్తాం. – ఆకుల రజిత, మున్సిపల్ చైర్ పర్సన్, హుస్నాబాద్

పనుల్లో జాప్యం
హుస్నాబాద్ పట్టణ శివారులో డబుల్ ఇళ్ల నిర్మాణం కొనసాగుతూనే ఉంది. దాదాపు సగం ఇళ్లు పూర్తికాగా, మరో సగం తుదిదశలో ఉన్నాయి. కిటికీలు, డోర్లు, మంచినీటి పైపులైన్లు, ఎలక్ట్రికల్ పనులు, తదితర పనులు పెండింగ్‌లో ఉన్నాయి. ఈ పనులు పూర్తయ్యేసరికి ఇంకా ఎన్ని రోజులు పడుతుందోనని లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు. అలాగే గౌరవెల్లి ప్రాజెక్టు నిర్వాసితులకు ఇక్కడి డబుల్ బెడ్రూం ఇళ్లలో తాత్కాలికంగా వసతి కల్పించారు. గూడాటిపల్లెకు చెందిన 20 కుటుంబాలను దాదాపు నెల రోజుల క్రితం తరలించి ఇక్కడ తాత్కాలిక వసతి ఏర్పాటు చేశారు.

అద్దె కష్టాలు తీరేదెప్పుడు
డబుల్ బెడ్రూం ఇళ్లు వచ్చిన వారు గృహప్రవేశం చేయకపోవడంతో పలువురు పేదలు ఇబ్బందులకు గురవుతున్నారు. నెలనెలా వేలల్లో ఇంటి అద్దె కడుతున్నామని, ఇళ్లు వచ్చిన తర్వాత కూడా అద్దె కష్టాలు తీరడం లేదని వాపోతున్నారు. ఇళ్లు వచ్చాయనే సంతోషం లేకుండా పోతుందని, మిగిలిన పనులను పూర్తి చేయించి గృహప్రవేశాలు చేయించాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

వివాహిత అదృశ్యం


ప్రసన్నలక్ష్మీ (ఫైల్)

రామచంద్రాపురం(పటాన్‌చెరు): కూర బాగాలేదని భర్త మందలించడంతో ఓ వివాహిత ఇంట్లో నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. పోలీసుల కథనం ప్రకారం..పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని బండలగూడలో నివాసం ఉండే అంజయ్య కూలీ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో ఆదివారం రాత్రి కూర బాగాలేదని భార్య ప్రసన్నలక్ష్మీతో గొడవపడ్డాడు. దీంతో ఆమె అదే రాత్రి ఇంట్లో ఎవరికీ చెప్పకుండా ఇంటి నుంచి వెళ్లిపోయింది. ఆమె ఆచూకీ కోసం స్నేహితులు, బంధువుల ఇంట్లో ఆరా తీసినా ఆచూకీ లభించలేదు. భర్త ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఆలయంలో శిలాఫలకం ధ్వంసం

జిన్నారం(పటాన్‌చెరు): బొల్లారం మున్సిపాలిటీ పరిధిలోని ఎస్సీ కాలనీలో శ్రీ రేణుక ఎల్లమ్మ, నల్ల పోచమ్మ ఆలయంలో ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని శనివారం రాత్రి గుర్తు తెలియని దుండగులు ధ్వంసం చేశారు. ఈ విషయంపై స్థానికులు పోలీసులకు ఫిర్యాదు చేస్తామన్నారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా దుండగులపై కఠిన చర్యలు తీసుకోవాలని బస్తీ వాసులు కోరారు. ఈ కార్యక్రమంలో రవి, బాలకృష్ణ, సురేష్, కాలనీ వాసులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో ఆవు మృతి

సదాశివపేట రూరల్ (సంగారెడ్డి): మద్దికుంట గ్రామ శివారులో సోమవారం విద్యుదాఘాతానికి గురై ఆవు మృతి చెందింది. స్థానికులు, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం..మద్దికుంట గ్రామానికి చెందిన దేవగోని మణయ్య తన ఆవును మేపడానికి గ్రామ శివారులోని పొలాల వైపు వెళ్లాడు. ప్రమాదవశాత్తు స్టార్టర్ నుంచి బోరుకు వెళ్లే విద్యుత్ తీగ ఆవు తాకి విద్యుదాఘాతానికి గురై మృతి చెందినట్లు దేవగోని మణయ్య తెలిపారు. ఆవు విలువ సుమారు రూ.45వేలు ఉంటుందన్నారు. సంఘ సేవకులు సతీశ్ రైతును పరామర్శించి రూ.15వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు.

వేర్వేరు ఘటనల్లో చికిత్స పొందుతున్న నలుగురి మృతి

నర్సాపూర్ మండలం అహ్మద్ నగర్ గ్రామానికి చెందిన దంపతులు పిల్లలు పుట్టడం లేదని మనస్థాపంతో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నారు. పటాన్‌చెరు టౌన్‌లోని బీడీఎల్‌లో ఓ వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. కొడిపల్లిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న వృద్ధురాలు మృతి చెందింది.

నర్సాపూర్ రూరల్: పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన భార్యాభర్తలు చికిత్స పొందుతూ హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో ఆదివారం రాత్రి మృతి చెందారు. కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..నర్సాపూర్ మండలం అహ్మద్ నగర్ గ్రామానికి చెందిన నీరుడి లక్ష్మణ్ (30), భార్య నీరుడి రాణి (26)లు ఈ నెల10వ తేదీన పురుగుల మందు తాగి ఇద్దరు ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. దీన్ని గమనించిన కుటుంబ సభ్యులు, గ్రామస్తుల సహకారంతో నర్సాపూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. స్థానిక వైద్యులు పరీక్షించి పరిస్థితి విషమంగా ఉందని చెప్పడంతో వారిని హైదరాబాద్ గాంధీకి తరలించారు. అక్కడ నుంచి వైద్యుల సలహామేరకు గచ్చిబౌలిలోని ఏఐజి ప్రవేట్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి లక్ష్మణ్, రాణిలు మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు సోమవారం కేసు నమోదు చేసుకొని మృతదేహాలకు పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

పిల్లలు పుట్టలేదని మనస్తాపంతో...


నీరుడి లక్ష్మణ్, రాణి (ఫైల్)

నీరుడి లక్ష్మణ్, రాణిలకు ఏడు సంవత్సరాల క్రితం పెళ్లయ్యింది. వారికి పిల్లలు పుట్టడం లేదని తరచూ బాధపడే వారని బంధువులు, గ్రామస్థులు తెలిపారు. పిల్లలు పుట్టాలని అనేక ఆస్పత్రుల చుట్టూ తిరిగారు. ఐనప్పటికీ ఫలితం లేదు. ఈ క్రమంలో వారు ఆర్థికంగా కూడా నష్టపోయినట్లు తెలిపారు. పిల్లలు పుట్టడం లేదన్న మనస్థాపానికి గురై ఇద్దరూ పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డారు.

పటాన్‌చెరు టౌన్: చిక్కిత్స పొందుతూ ఓ వ్యక్తి మృతి చెందాడు. హెడ్ కానిస్టేబుల్ పాషా తెలిపిన వివరాల ప్రకారం..పటాన్‌చెరు మండలం నందిగామ గ్రామానికి చెందిన కుమ్మరి అశోక్(38) ఓ ప్రైవేట్ కంపెనీలో పనిచేసేవాడు. గత కొంతకాలంగా ఆరోగ్యం బాగాలేక ఇంటి వద్దే ఉంటూ, ఇంటి అవసరాల నిమిత్తం అప్పులు చేశాడు. ఈ క్రమంలో 13వ తేదీన సాయంత్రం నందిగామ గ్రామ శివారులోని తన వ్యవసాయ పొలంలో పురుగుల మందు తాగి, కుటుంబ సభ్యులకు ఫోన్ చేసి సమాచారం ఇచ్చాడు. దీంతో ఆందోళనకు గురైన కుటుంబ సభ్యులు ఘటన స్థలానికి చేరుకొని ఇస్నాపూర్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ నుంచి మెరుగైన చికిత్స నిమిత్తం గచ్చిబౌలి లోని ఓప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతిచెందాడు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.


రుదావత్ రాంకీబాయి(ఫైల్)

కొడిపల్లి(నర్సాపూర్): రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ వృద్ధురాలు చికిత్స పొందుతూ మృతి చెందింది. చిలప్‌చెడ్ మండలం బట్టూ తండాకు చెందిన రుడావత్ రాంకీ బాయి (60)కి ఆదివారం రాత్రి నాగ్సాన్‌పల్లి శివారులో జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం ఆమెను హైదరాబాద్‌లోని గాంధీ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందింది.

రోడ్డు ప్రమాదంలో నలుగురి మృతి

ఎనిమిది మందికి గాయాలు


అనిల్ సదా మృతదేహం


ధర్మేందర్ మృతదేహం

వేరేవేరు రోడ్డు ప్రమాదంలో నలుగురి మృతి చెందగా, ఎనిమిది మందికి గాయాలయ్యాయి.

పటాన్‌చెరుటౌన్: ఓఆర్ఆర్‌పై అశోక్ లే లాండ్ ట్రాలీ సోమవారం మధ్యాహ్నం బోల్తాపడ్డ ఘటనలో ఇద్దరు మృతి చెందారు. మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..బిహార్ రాష్ట్రానికి చెందిన దినసరి కూలీలు వట్టి నాగులపల్లిలోని అనిల్ గ్రానైట్ షాపు నుంచి అశోక్ లే లాండ్ ట్రాలీలో గ్రానైట్స్ లోడ్ చేసుకొని ఓఆర్ఆర్ మీదుగా బొల్లారం వెళ్తున్నారు. పోచారం శివారులోకి రాగానే బండి వెనుక టైరు పగిలి, పల్టీ కొట్టింది. ఇందులో ఉన్న ఐదుగురిలో అనిల్ సదా(30) అక్కడికక్కడే మృతి చెందగా, ధర్మేందర్(35) పటాన్‌చెరు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. మరో ఇద్దరికి రామ్ బాలక్ సహాని, గిరేందర్ సాహులకు బలమైన గాయాలవ్వడంతో పటాన్‌చెరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మరో వ్యక్తి నందన్ కుమార్ స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. ఎస్‌ఐ ప్రసాద్ రావు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

దుబ్బాకరూరల్: ఆటో పల్టీపడి ఐదుగురికి గాయాలైన సంఘటన మండలంలోని చీకోడ్ రోడ్డులో సోమవారం జరిగింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం..మండలంలోని రామక్కపేట గ్రామానికి చెందిన పలువురు ఆటోలో పని నిమిత్తం రాజన్న సిరిసిల్లా జిల్లా ముస్తాబాద్ మండలం ముచ్చర్ల గ్రామానికి వెళ్లి తిరిగి వస్తుండగా చీకోడ్ సమీపంలోకి రాగానే ఆటో అదుపుతప్పి బోల్తాపడింది. అందులో ప్రయాణిస్తున్న భాగ్య, అక్షయ, ఆసిక, బాలవ్వ, పూజలకు స్వల్ప గాయాలయ్యాయి. దీన్ని గమనించిన చీకోడ్ ఎంపీటీసీ రాంరెడ్డి గాయాలైన వారిని ఆటోలో దుబ్బాక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

టేక్మాల్(మెదక్): గుర్తు తెలియని వాహనం ఢీకొని గుర్తు తెలియన వ్యక్తి మృతి చెందిన సంఘటన టేక్మాల్ మండలంలోని వెంకటాపూర్ శివారులో ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. స్థానిక ఎస్‌ఐ రమేశ్ తెలిపిన వివరాల ప్రకారం..మెదక్–బొడ్మట్‌పల్లి ప్రధాన రహదారి వెంకటాపూర్ శివారులో నడుచుకుంటూ వెళ్తున్న గుర్తు తెలియని వ్యక్తిని, గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టింది. దీంతో ఆ వ్యక్తి తలకు తీవ్ర గాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. ఎవరైనా సంబంధికులు ఉంటే టేక్మాల్ పోలీస్ స్టేషన్‌లో 8712657925కు సంప్రదించాలని ఎస్‌ఐ కోరారు.


పోచమ్మ (ఫైల్)

పాపన్నపేట(మెదక్): రోడ్డు ప్రమాదంలో గాయపడిన మహిళ సోమవారం తెల్లవారుజామున మృతిచెందినట్లు ఏఎస్‌ఐ సంగన్న తెలిపారు. అన్నారం గ్రామానికి చెందిన పోచమ్మ(45) మరికొందరు మహిళలతో కలిసి దుంపల కుంటకు వరి నాట్లు వేసేందుకు వెళ్లింది. ఆదివారం సాయంత్రం అన్నారం శివారులో ఆటో అదుపుతప్పి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో పోచమ్మకు తీవ్రగాయాలయ్యాయి. వైద్యం నిమిత్తం హైదరాబాద్‌కు తరళిస్తున్న క్రమంలో మార్గమధ్యలో పోచమ్మ మృతి చెందిది. ఈ ప్రమాదంలో గాయపడిన సురేఖ పరిస్థితి విషమంగా ఉన్నట్లు గ్రామస్థులు తెలిపారు. కేసుదర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ తెలిపారు.

ఘనంగా సాంకేతిక దినోత్సవం

ఝరాసంగం(జహీరాబాద్): భారతీయ వ్యవసాయ పరిశోధన మండలి 95వ వ్యవస్థాపక, సాంకేతిక దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. సోమవారం మండల పరిధిలోని బిడెకన్నె గ్రామంలో డీడీఎస్–కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో వేడుకలను నిర్వహించారు. డీడీఎస్–కేవీకే శాస్త్రవేత్తలు నిర్వహించిన క్షేత్ర పరిశీలన, సాంకేతిక పరిజ్ఞానాన్ని ప్రదర్శించి, రైతులకు వివరించారు. అదే విధంగా సాంకేతికతను వినియోగించిన రైతులు తమ అనుభవాన్ని పంచుకున్నారు. వానాకాలంలో వేసే పంటలు, రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై చర్చించారు. అంతర్జాతీయ చిరుధాన్యాల సంవత్సరం 2023ని పురస్కరించుకుని వాటి ప్రాముఖ్యతను తెలుసుకున్నారు. చిరుధాన్యాల వంటకాలపై పోటీలను నిర్వహించి, విజేతలకు బహుమతులు, సర్టిఫికేట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో డీడీఎస్–కేవీకే శాస్త్రవేత్తలు, రైతులు పాల్గొన్నారు.


చిరుధాన్యాల వంటకాలను పరిశీలిస్తున్న నిర్వాహకులు, రైతులు

లక్ష్యంతో చదవాలి

సదాశివపేట(సంగారెడ్డి): విద్యార్థులు నిర్దిష్ట లక్ష్యంతో చదివితే ఉన్నత శిఖరాలకు చేరుతారని వెంకటాపూర్ ఎంపీటీసీ ఒగ్గు శ్రీనివాస్ పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని శాంతినికేతన్ పాఠశాలలో ఇంటర్మీడియట్ పరీక్షల్లో మంచి మార్కులు సాధించిన పూర్వ విద్యార్థులను శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లక్ష్యం నెరవేర్చుటకు కృషి, పట్టుదలతో పాటు ప్లానింగ్ ఉండాలన్నారు. అనంతరం పాఠశాల కరస్పాండెంట్ మాలిపటేల్ ప్రభు మాట్లాడుతూ ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యార్థులను అత్యున్నత స్థాయికి తీసుకెళ్లాలంటే ఉపాధ్యాయులకు తల్లిదండ్రులు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు అరవిందశ్రీ, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సమ్మెకు కేవీపీఎస్ మద్దతు

కొండాపూర్(సంగారెడ్డి): సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మండల కేంద్రాల్లో పంచాయతీ కార్మికులు చేపట్టిన దీక్షలకు కేవీపీఎస్ మద్దతు ప్రకటిస్తున్నట్టు ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు అశోక్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 12 రోజులుగా గ్రామపంచాయతీ కార్మికులు సమ్మె చేస్తుంటే రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోకుండా నిర్లక్ష్యం వహిస్తుందన్నారు. గతంలో సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీలు నెరవేర్చాలని డిమాండ్ చేశారు. కనీస వేతనం రూ.19,500లు ఇవ్వాలని, అలాగే ప్రతీ కార్మికునికి ఈఎస్ఐ, పీఎఫ్ ప్రమాదాలు జరిగితే ఎక్స్‌గ్రేషియా వంటి సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కొండాపూర్ మండల కార్యదర్శి రాంచందర్, మధు, శ్రీనివాస్, నవీన్ కుమార్, అనిల్ తదితరులు పాల్గొన్నారు .

ఎంపీపీ కార్యాలయం వద్ద
జహీరాబాద్ టౌన్: సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మున్సిపల్ కార్మికులు ఎంపీపీ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా కార్మిక నాయకులు మాట్లాడుతూ తమ సమస్యలను ప్రభుత్వం పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కనీస వేతనాలు, పీఎఫ్, ఈఎస్ఐ, ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని ప్రభుత్వాన్ని వారు కోరారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్మిక సంఘం నాయకులు రాజు, రాబర్ట్, ఏసప్ప, కమలమ్మ, రమేశ్‌లు పాల్గొన్నారు.


సమ్మెలో మాట్లాడుతున్న అశోక్

వేర్వేరు చోట్ల ముగ్గురి ఆత్మహత్య

వేర్వేరు కారణాలతో ముగ్గురు ఆత్మహత్య చేసుకున్నారు.


మణి కుమార్ మృతదేహం

పటాన్‌చెరు టౌన్: మద్యానికి బానిసై ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్‌ఐ దుర్గయ్య కథనం ప్రకారం..ఏపీలోని కృష్ణాజిల్లా, నాగలంక మండలం గొల్లమంద గ్రామానికి చెందిన దేవబోయిన మణి కుమార్(23) నాలుగు నెలల క్రితం బతుకుదెరువు కోసం పటాన్‌చెరు మండలం ముత్తంగికి వచ్చి పెయింటర్ పనిచేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో అతను మద్యానికి బానిసై మణికుమార్ 16వ తేదీన పని ముగించుకొని మద్యం సేవించి రూమ్‌కు వచ్చాడు. ఆదివారం రాత్రి రూమ్ మెట్ నాంచారయ్య రూమ్‌కు వచ్చి డోర్ కొట్టగా తీయలేదు. అనుమానంతో తలుపులు తోసి లోనికి వెళ్లి చూడగా ఇంట్లో దూలానికి ఉరివేసుకొని కనిపించాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. మృతుడి సోదరుడు విజయ్ కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

బెట్టింగ్‌కు పాల్పడి..


సాయికు కుమార్ మృతదేహం

పటాన్‌చెరు టౌన్: ఆన్‌లైన్ బెట్టింగ్‌కు అలవాటు పడి అప్పులపాలైన యువకుడు ఆత్మహత్య చేసుకొని మృతిచెందాడు. ఏఎస్‌ఐ సురేందర్ రెడ్డి కథనం ప్రకారం..పటాన్‌చెరు పట్టణం రామ్‌మందిర్ రోడ్డుకు చెందిన కుంచారం సాయికుమార్(26) గత కొంత కాలంగా ఆన్‌లైన్ బెట్టింగ్‌కు అలవాటు పడి, పెద్ద మొత్తంలో నగదు పోగొట్టుకొని అప్పులపాలయ్యాడు. ఈ క్రమంలో 17వ తేదీన సాయి కుమార్ తల్లిదండ్రులు దేవాలయానికి వెళ్లగా ఇంట్లో ఎవరు లేని సమయంలో బెడ్ రూమ్‌లో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. మృతుడి తల్లి లలిత ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

చెరువులో పడి మహిళ


మదీనా (ఫైల్)

రాయపోలు(దుబ్బాక): చెరువులో పడి మహిళ మృతిచెందింది. రాయపోలు ఎస్‌ఐ మహబూబ్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన మహ్మద్ మదీన (35)కి రేచీకటి వ్యాధి ఉండడంతో వివాహం కాలేదు. పుట్టింటి వద్దే ఉంటుంది. ఈ నెల 14న మదీన రాత్రి నుంచి కనబడకుండా పోయింది. ఎక్కడ వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో కుటుంబసభ్యులు స్థానిక పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేశారు. సోమవారం రామారంలోని రాందాసు చెరువులో ఓ మహిళ మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. ఈ విషయాన్ని వారు పోలీసులకు సమాచారం అందజేశారు. అక్కడికెళ్లిన కుటుంబ సభ్యులు మృతురాలు మదీనాగా గుర్తించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నటు తెలిపారు.